ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.6 , కనిష్ఠం 26.2
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 27 మార్చి 2024



కాలబైరవస్వామికి సింధూర పూజలు

రామారెడ్డి, మార్చి 26: ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. రూ.5,316ల మాలను స్వామివారి మెడలో వేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈవో ప్రభురాంచంద్రంగుప్తా తదితరులు పాల్గొన్నారు.





- జహీరాబాద్‌పై ఎంపీ పోరుకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు
- హ్యాట్రిక్ కొట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు
- గెలుపు సాధిస్తామంటున్న బీజేపీ
- పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్న సిట్టింగ్ ఎంపీ

ఎవరి ధీమా వారిదే!

కామారెడ్డి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. అన్ని రాజకీయ పార్టీలు యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైన సత్తా చాటాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. విజయంపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ ఎంపీ స్థానానికి ప్రధాన పార్టీలు తమ తమ అభ్యర్థులను సైతం ప్రకటించాయి. అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ పార్టీ తరపున గాలి అనిల్‌కుమార్‌లు పోటీ చేస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించుకున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీటును గెలుచుకుని జహీరాబాద్‌పై జెండా ఎగురవేసేందుకు పావులు కదుపుతోంది. ఇక బీఆర్ఎస్ తన సెంటిమెంట్‌తో జిల్లాలో మళ్లీ పట్టు సాధించాలని ప్రయత్నాలు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కొంత అసంతృప్తి మిగిల్చిన పార్లమెంట్ ఎన్నికల విజయంపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. ఇక బీజేపీ ఈ సారి ఎలాగైన సత్తా చాటాలని చూస్తోంది. సిట్టింగ్ ఎంపీ బీజేపీలో చేరడం ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

గెలుపుపై కాంగ్రెస్‌లో ఆశలు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అన్ని పార్టీల కంటే ఎక్కువ ఓట్లు సాధించింది. ఏడుగురు అభ్యర్థులకు కలిపి సుమారు 5.60లక్షల ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ కంటే సుమారు 20వేల ఓట్లు అధికంగా సాధించింది. ఇదే ఉత్సాహంతో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా విజయం సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి పూర్వ వైభవాన్ని పొందేందుకు కసరత్తు చేస్తోంది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంతో పోలిస్తే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు మరింత రెట్టింపు అయింది. ఎల్లారెడ్డి, జుక్కల్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. మిగితా అసెంబ్లీ స్థానాల్లోనూ స్వల్ప ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ స్వల్ప ఓట్లతో ఓడిపోయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గెలువడంపై ధీమా వ్యక్తం చేస్తోంది.

వివిధ అంశాలపై ప్రజల్లోకి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ రూపొందించుకున్నట్లు సమాచారం. తమ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించి శ్రేణుల్లో ఉన్న అసంతృప్తులను, అనైతికతలను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జాజాల సురేందర్‌లు ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థి అనిల్‌కుమార్ తరపున ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే లోక్‌సభ పరిధిలో బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. అదేవిధంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డిలో బీఆర్ ఎస్‌కు మంచి ఓట్లే దక్కాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవచ్చనే ధీమా ఆ పార్టీ వర్గాల్లో ఉంది.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ లోక్‌సభ పరిధిలో కామారెడ్డిలో బీజేపీ గెలుపొందింది. అయితే మిగితా నియోజకవర్గాల్లో మాత్రం ఓట్లు ఆశించిన మేర రాలేక పోయాయి. కానీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు చాలా తేడా ఉంటుందని ఓటర్లు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వైపే మొగ్గు చూపే అవకాశం ఉందని మోదీ చరిష్మ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం లాంటి అంశాలు ఓట్లు రాబడతాయని ఆ పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి.

సానుకూల వాతావరణాన్ని సృష్టించుకునేందుకు

అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం తమకు సానుకూల వాతావరణం కల్పించిందని ఈ పరిస్థితులు తమకు ఓట్లు సాధించి పెడుతాయని బీజేపీ భావిస్తోంది. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ ఇప్పటికే నియోజకవర్గాల్లో పర్యటిస్తూ సమావేశాలు నిర్వహిస్తూ పలు గ్రామాల్లో ప్రజలను కలిసి ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం విడు దల చేసిన నిధుల వివరాలను, జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్నారు. మళ్లీ గెలిస్తే చేసే అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు.



బీఆర్ఎస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని రైతుల వద్దకు వెళ్తున్నారు

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, మార్చి 26: బీఆర్ఎస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని రైతుల వద్దకు వెళ్తున్నారని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ప్రశ్నించారు. మంగళవారం బీఆర్ఎస్ నేతలు పంట నష్టం పరిశీలనకు వెళ్లడంపై స్పందిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో అనావృష్టి వల్ల ఆరు సార్లు పంట నష్టపోతే ఒక్కసారి కూడా పంట నష్టపరిహారం అందించలేదని కనీసం వారిని పరామర్శించిన పాపాన పోలేదని అన్నారు. అవినీతితో బీఆర్ఎస్ పార్టీ కంపుకొడుతుందని, కేసీఆర్ వేల కోట్ల అవినీతితో మేడిగడ్డ కుంగిపోయిందన్నారు. పంటలకు నీరు అందుతాయని రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయని అన్నారు. లిక్కర్ కుంభకోణంలో కూతురు కవిత, భూ కబ్జాలతో సంతోష్‌రావు, కన్నారావు, ఫోన్ ట్యాంపింగ్ కేసులో కేటీఆర్ జైలుకు పోయే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. అకాలవర్షాలు, వడగండ్లు, పంట నష్టం గ్రామాల్లో పంటల స్థితి గతులను క్షేత్రస్థాయిలో అధికారులతో పరిశీలించి సర్వే చేయించామని తెలిపారు. రైతులు, కౌలు రైతులతో మాట్లాడి ధైర్యం తెలిపామని రైతులు నిరాశ నిస్పృహలకు లోనుకావద్దని అండగా ఉంటామని తెలిపారు. పంట నష్టపోయిన ప్రతీ రైతును అన్ని విధాల ఆదుకుంటామని రైతులు ఆత్మస్థైర్యం దెబ్బతిన్నదని ఆలోచించి సీఎం రేవంత్‌రెడ్డి పంట నష్టంపై సర్వే చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి చర్యలు తీసుకుంటున్నారని, రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్ని వ్యవస్థలను గత పాలకులు చిన్నాభిన్నం చేశారని తెలిపారు. ఇప్పటి వరకు 5 ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు నగదు బదిలీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో పంటల బీమా పథకం అమలు చేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు చేయలేదని, పంట నష్టానికి కూడా నిధులు ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించిందని, రైతుల పంట బీమా రుసుం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు.

ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది



బాన్సువాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

- గత పదేళ్లలో ఎంపీగా బీబీ పాటిల్ ఏం పని చేశాడు
- నేను కాంగ్రెస్ పార్టీలోకి మారడం లేదు.. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా
- నా రాజకీయ వారసుడిగా పోచారం భాస్కర్‌రెడ్డిని ప్రకటిస్తున్నా
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ/పెద్దకొడప్‌గల్, మార్చి 26: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ, జుక్కల్‌లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాలను నిర్వహించారు. బాన్సువాడలో ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 110 రోజులు అవుతున్నా ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, ఇందిరమ్మ ఇల్లు రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, మహిళలకు భృతి, మొత్తం 420 హామీల్లో ఏ ఒక్క హామీ అమలు కావడం లేదని ఆయన పేర్కొన్నారు. ఏ అర్హతతో కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు అడుగుతుందన్నారు. రైతులను కడుపులో పెట్టుకుని కాపాడిన బీఆర్ఎస్‌కు మాత్రమే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. రాజకీయాల్లో బండ్లు ఓడలవుతాయి, ఓడలు బండ్లు అవుతాయని రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. గత పదేళ్లలో ఎంపీగా బీబీ పాటిల్ అధికారంలో ఉండి ఏం పని చేశాడని ఆయన ప్రశ్నించారు. సొంత పైరవీలు, వ్యాపారాలు చేసుకోవడం తప్ప బీబీ పాటిల్ ప్రజా సమస్యలు తెలుసుకున్నది లేదన్నారు. సురేష్ శెట్కార్ కూడా గతంలో ఐదేళ్ల పనిచేసి ఏం చేశారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించడం జరిగిందని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ బాన్సువాడ మీదుగా నూతన బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని, పారి శ్రామికంగా అభివృద్ధి చెంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. నేను కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని ఎమ్మెల్యే పోచారం అన్నారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీలో మారుతున్నట్లు వస్తున్న కథనాలు అవాస్తవం అని అన్నారు. నాకు బీఆర్ఎస్ పార్టీలో గౌరవం ఉందని, కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతానన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో నా రాజకీయ వారసుడిగా పోచారం భాస్కర్‌రెడ్డిని ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

సీఎస్ శాంతికుమారి

కామారెడ్డి టౌన్, మార్చి 26: యాసంగి 2023-24 వరి పంట కొనుగోలు నిమిత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. యాసంగి ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ డెలివరి, తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలిపారు. జిల్లాలో 347 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో సహకార సంఘాల ద్వారా 325, ఐకేపీ ఆధ్వర్యంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంట కోతలకు అనుగుణంగా ప్రారంభించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఎక్కడ జోక్యం చేసుకోకుండా చూడాలని, అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై ఎక్కడ ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, డీఆర్‌డీవో పీడీ చందర్‌నాయక్, తదితరు లు పాల్గొన్నారు.

మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహణ

పార్లమెంట్ ఎన్నికల విధుల ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సమక్షంలో నిర్వహించారు. జిల్లాలోని 4 శాసనసభ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కోసం పీవో, ఏపీవోలను నియమించడం, వారితో శిక్షణ అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పోలింగ్ అధికారులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2,3,4 తేదీల్లో మాస్టర్‌ట్రైనర్లతో శిక్షణ ఉంటుందని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గ అధికారులకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఎల్లారెడ్డిలో ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో, జుక్కల్‌లో ఏప్రిల్ 3, 4 తేదీల్లో బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, బాన్సువాడలో ఏప్రిల్ 4వ తేదీన బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్	సహర్
సా.6.35	ఉ.4.51



ఉపవాసం పాటించు.. దానికి మించిన సదాచారణ మరొకటి లేదు

గంజాయి మత్తులో యువత

భిక్కనూరు, మార్చి 26: యువత అంటే మార్పును ఆశించే నవతరం. ఎప్పటికప్పుడు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని భవితకు బాటలు వేసుకునే శక్తి. తలుచుకుంటే ఏదైనా సాధించే ఆత్మవిశ్వాసం వారి సొంతం. ఈ ఆధునిక కాలంలో కొందరు యువత ఉన్నత లక్ష్యాలను టార్గెట్‌గా పెట్టుకుని వాటి సాధనకు కష్టపడుతుంటే, మరికొంత మంది యువత చెడు వ్యసనాలకు బానిసలై పెడదోవ పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులుగా ఉన్న యువకులెందరో ఒకరిని చూసి మరొకరు పెడదారిలో ప్రయాణిస్తూ వారి విలువైనా జీవితాలను కోల్పోతున్నారు. తల్లిదండ్రులు, పాఠశాలు, కళాశాల యాజమాన్యం, పోలీసులు వారిని పెద్దగా పట్టించుకోకపోవడంతో చిన్నచిన్న సంఘటనలను పెద్దవిగా చేసి రోడ్లపై గొడవలు పడటం, అనవసరమైన వాటిలో తలదూర్చడం, దొంగతనాలకు అలవాటుపడటం, మహిళలను వేధించడం చేస్తూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. వీరు ఇలా చేయడానికి ముఖ్యంగా డ్రగ్స్, వైట్‌నర్, గంజాయికి అలవాటు పడటమే కారణమన్నది ప్రధానంగా వినిపిస్తున్న మాట.

తల్లిదండ్రులను ఎదిరించడం.. గొడవలు పడటం

గ్రామాల్లో విద్యార్థులు, యువత వారికన్నా పెద్దవయస్సు వారితో గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, తల్లిదండ్రులతో ఎంతో మర్యాదగా ప్రవర్తించడం నాటి నుంచి వస్తున్న సంప్రదాయం. కానీ ప్రస్తుతం మాదకద్రవ్యాలకు అలవాటు పడిన చాలా మంది యువకులు డబ్బుల కోసం తన తల్లిదండ్రులను ఎదిరించడం, హింసించడం, దాడులు చేస్తూ రానురానూ మానవ సంబంధాలకు విలువ లేకుండా చేస్తున్నారు. గతంలో సాయంత్రం అయ్యిందంటే, సెలవులు వచ్చాయంటే చిన్నారులు యువకులు పాఠశాల, కళాశాల మైదానాల వద్దకు చేరుకుని క్రీడలు ఆడేవారు. పార్టీలు, దావత్‌లంటే తెలిసేవీకాదు. సిగరేట్లు, మద్యపాన వ్యసనాలకు దూరంగా ఉండేవారు. కొందరు అలవాటు ఉన్నవారు తల్లిదండ్రులకు, వారికంటే పెద్ద వయస్సు వారి చాటుకు సేవించేవారు. కానీ నేటి యువతలో చాలా మంది చిన్న, పెద్ద తారతమ్యాలు లేకుండా ప్రవర్తించడం, చిన్నచిన్న విషయాలకే గొడవలు పడి దాడులు చేయటం, పెద్దవయస్సు వారితోనే సిట్టింగ్‌లు చేయడం, బహిరంగంగానే దూమపానం చేయడం, గంజాయి సేవించడం, కల్లు దుకాణాల్లో బహిరంగంగానే కల్లు, మద్యం తాగడం లాంటివి చేస్తున్నారు.

మాదకద్రవ్యాల అలవాటే కారణమా?

యువతలో ఇంతలా మార్పు రావడానికి ప్రధాన కారణం మాదకద్రవ్యాలే ప్రధాన కారణమన్నది ఎవరుకాదనలేని నిజం. గంజాయి, డ్రగ్స్ నేటి కాలంలో విచ్చలవిడిగా లభిస్తుండటంతో ఒకరిని చూసి మరొకరు ఈ మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. వాటిని విక్రయించే వారు సైతం ముఖ్యంగా యువతను ఎంచుకుని వారే లక్ష్యంగా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా యువత ఈ మాదకద్రవ్యాలను సేవించగానే చిన్నపెద్ద తేడా లేకుండా వ్యవహరించడం, దొంగతనాలకు పాల్పడటం, కయ్యానికి కాలుదువ్వడం, బైక్‌లను అతివేగంగా నడుపుతూ ఇతరులకు ఇబ్బందులు కలగించడం, మహిళలు, యువతులను వేధించడం వంటివి చేస్తున్నారు.

మాదకద్రవ్యాల కట్టడికి చర్యలేవీ?

రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కిందిస్థాయిలో అది అమలు జరిగినప్పుడే అకున్నది సాధ్యమవుతోంది. జిల్లాలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా గంజాయి మహమ్మారి రాజ్యమేలుతోంది. ఈ మాయదారి గంజాయిని ఎవరు విక్రయిస్తున్నారో, వారికి ఎక్కడ లభిస్తుందో తెలియదు కానీ యువకులు చెడిపోతున్నారన్న ముచ్చట్లు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. గతంలో తమ గ్రామంలో యువకులంటే ఎంత మంచిగా నడుచుకుంటూ, చదువులో, క్రీడల్లో ముందుంటుండే కానీ ప్రస్తుతం యువకుల్లో చాలా మంది ఎల్లప్పుడు మత్తులో ఉంటు ప్రజలకు ఏదో విధంగా ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి గ్రామాల్లో ఉంది. ఈ మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లాలోని కొన్నిచోట్ల ఎక్సైజ్, పోలీసు అధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ వీటిని విక్రయిస్తున్న వారిని పట్టుకుని వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తుండగా మరికొన్నిచోట్ల మాత్రం అంతంత మాత్రంగానే తనిఖీలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా యువకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలతో పాటుగా గ్రామాల్లో మాదకద్రవ్యాల బారిన యువత పడకుండా పోలీసు, ఎక్సైజ్ అధికారులు యువకులకు అవగాహన కార్యక్రమాలు చేట్టాలని జిల్లావ్యాప్తంగా ప్రజలు కోరుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కళాశాలల్లో, పాఠశాలల్లో మాదకద్రవ్యాలను సేవిస్తున్న వారిని, వారికి వాటిని విక్రయిస్తున్న వారిని గుర్తించి వారిపట్ల కఠినంగా వ్యవహరించి వారి వల్ల మరొకరు వాటికి అలవాటు పడకుండా పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- జిల్లాలో నానాటికీ పెరుగుతున్న గంజాయి ప్రియుల సంఖ్య
- డబ్బుల కోసం నిత్యం తల్లిదండ్రులను వేధిస్తున్న యువత
- మరికొందరు దొంగతనాలకు పాల్పడుతున్న వైనం
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజల వినతి



దేవునిపల్లి శివారులో గంజాయి బాబులు ఉపయోగించే బాటిల్‌తో తయారు చేసిన పరికరం

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

బోధన్ రూరల్, మార్చి 26 : అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంజీర పరివాహక ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. రాత్రి వేళ ఇసుక రవాణా నిషేధమని, ఇసుక అక్రమ రవాణా చేస్తే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పగటి పూట మాత్రమే ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఉంటేనే ఇసుక రవాణా చేయాలని సూచించారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ



సాలూర చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సాలూర అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద మంగళవారం పోలీసులు బలగాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ కోల నరేష్ మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి తెలంగాణ వైపు వచ్చే వాహనాలను తనిఖీలు చేపడుతున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెద్ద ఎత్తున డబ్బులు ఎవరూ ఇతర పనుల మీద తీసుకెళ్ల వద్దన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. బోధన్ నుంచి మహారాష్ట్ర వెళ్లే వాహనాలను సైతం తనిఖీలు చేపడుతున్నారు. రాకపోకల వారి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. బోధన్ తహసీల్దార్ గంగాధర్ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు తదితరులు ఉన్నారు.

పొతంగల్ చెక్‌పోస్టులో నగదు పట్టివేత

కోటగిరి,మార్చి26: పొతంగల్ మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.2లక్షల 29వేల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఎన్నికల వేళ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా మహరాష్ట్ర నుంచి తెలంగాణ వైపు వస్తున్న అనే ఒక బైక్ వద్ద గల వాహనాన్ని తనిఖీ చేశారు. నాందేడ్ జిల్లా ఉన్‌గుండకు చెందిన నగేష్ షెట్కార్ అనే వ్యక్తి రూ.2.29లక్షల నగదు ఉండడంతో వివరాలు అడిగారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించకపోవడంతో నగదును సీజ్ చేసి బాన్సువాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామన్నారు. వాహనదారులు రూ.50వేల కన్న ఎక్కువ డబ్బులతో ప్రయాణిస్తే సరైన పత్రాలు ఉంచుకోవాలని ఎస్ఐ సూచించారు.



పొతంగల్ చెక్‌పోస్టులో నగదు పట్టుకున్న దృశ్యం

రైతు వేదికల నిర్వహణ ముందుకు సాగేదెలా?



సాలూరలోని రైతు వేదిక

- నిధులు రాక నిర్వహణకు తప్పని తిప్పలు
- ఏడాదిగా నిధులు రాక నిర్వహణకు ఇబ్బందులు పడుతున్న వైనం

బోధన్ రూరల్, మార్చి 26: రైతు వేదిక నిర్వహణ ముందుకు సాగడం ప్రశ్నార్థకంగా మారింది. ఏడాది కాలంగా రైతు వేదికల నిర్వహణకు నిధులు రాక నిర్వాహకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాహణకు నిధులు రాకపోవడంతో ఏఈవోలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని రైతు వేదికల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నెలనెలా వచ్చే నిధులు ఏడాదిపైగా రాకపోవడంతో రైతు వేదికల నిర్వహణ సరిగ్గా సాగడం లేదు. బోధన్ డివిజన్‌లో 22 రైతు వేదికలు ఉండగా జిల్లా మొత్తంలో 106 రైతు వేదికలు ఉన్నాయి. రైతు వేదికల నిర్వహణకు నిధులు రాకపోవడంతో విస్తరణ అధికారులకు పెనుభారంగా మారింది. రైతులు నిరంతరం సమావేశాలు నిర్వహించుకుని పంటల సాగు, కొత్త విధానాలతో పాటు అధికారుల సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు వీలుగా జిల్లాలో రైతు వేదికలను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా 106 రైతు వేదికలను నిర్మించింది. వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులకు అందుబాటులో ఉండేలా రైతు వేదికల్లో వసతులు కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైక్‌సెట్‌ల వంటివి కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ నిధులతో పాటు రైతుల తోడ్పాటుతో కొన్ని చోట్ల అవసరమైన సౌకర్యాలను సమకూర్చుకున్నారు. వీటిలో సీజన్ వారీగా పంటల సాగుపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికల్లో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వీటిని ఇతర శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. రైతు వేదికలు కొన్ని గ్రామాలకు దగ్గరగా ఉండగా, మరికొన్నింటిని దూరంగా నిర్మించారు. వీటిలోనే క్లస్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఒక్కో రైతు వేదికను సుమారు రూ.22 లక్షలతో నిర్మించారు. వాటి నిర్వహణకు మొదట నిధులు కేటాయించారు. రైతు వేదికలను నిత్యం శుభ్రం చేసేందుకు విద్యుత్ చార్జీలు, తాగునీటి కోసం స్టేషనరీ మరమ్మతుల కోసం నెలకు రూ.9,500 కేటాయించింది. రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. 2022 ఆగస్టు వరకు ప్రతినెలా రూ.9,500 చొప్పున గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు డబ్బులు రాకపోవడంతో ఏఈవోలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో రైతు వేదికలో విద్యుత్ చార్జీలు ప్రతినెల చెల్లించకపోవడంతో వేలల్లో బకాయిలుగా మిగిలిపోయాయి. డబ్బులు విడుదల చేయాలని గత ప్రభుత్వానికి కూడా విన్నవించినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

• కొత్త ప్రభుత్వం... రైతు నేస్తం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు నేస్తం అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగానే రానున్న సీజన్‌లో రైతు వేదికల్లో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై శాస్త్రజ్ఞులతో రైతులకు శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ఏఈవోలు గ్రామాలకు వచ్చినప్పుడు గ్రామ పంచాయితీ కార్యాలయాలను వినియోగించుకునే వారు. రైతులకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి రైతు వేదికలు నిర్మించడం వల్ల వాటిని వ్యవసాయ క్లస్టర్ కార్యాలయాలుగా వినియోగించుకుంటున్నారు. ఈ వేదికల వల్ల ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటున్నారు. వాటి నిర్వహణకు సంబంధించి నెలనెల ఇవ్వాల్సిన డబ్బులు అందకపోవడంతో శుభ్రం చేయడం, తాగునీటి కోసం ప్రస్తుతం ఏఈవోలు సొంతంగా సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా రైతు వేదికల నిర్వహణకు డబ్బులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఏడాదికిపైగా డబ్బులు రావడం లేదు. దీంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. రైతు వేదికల నిర్వహణ డబ్బులు రాకపోవడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-వాజీద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

టీయూలో క్రీడా పోటీలు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 26: తెలంగాణయూనివర్సిటీలో మంగళవారం ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని క్రీడా పోటీలను టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఓటమిని గెలుపుగా స్వీకరించి ముందుకు సాగితే విజయం తథ్యమని కాంట్రాక్ట్ అధ్యాపకులు డా.దత్తహరి అన్నారు. ఎన్ఎస్‌యూఐ వర్సిటీ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నమని స్నేహభావం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా.శ్రీనివాస్,ఎన్ఎస్‌యూఐ నాయకులు రాజేందర్, సాగర్ నాయక్, నిరంజన్, శ్రీకాంత్, విజయ్, అశ్విన్, అనిల్, నవీన్, అనిల్ నంద, పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం


మోర్తాడ్ బస్టాండ్‌లో శుభ్రం చేస్తున్న కళాశాల విద్యార్థులు

మోర్తాడ్, మార్చి26: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రమదానం నిర్వహించారు. బస్టాండ్‌లో ప్రజలకు ప్లాస్టిక్ వల్ల నష్టాలు, దుష్పరిణామాల గురించి వివరించారు. వ్యర్థాలను గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్తకుండిలో వేయాలని, తడిచెత్త, పొడిచెత్త వేర్వేరు చెత్తకుండీలో వేయాలని సూచించారు. గుట్కా, పాన్‌దార్ల వంటిని బహిరంగ ప్రదేశాల్లో ఊమ్మివేయవద్దని వివరించారు. వేసవికాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారి భూపతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతులకు రుణాలు, ఎరువులు అందిస్తున్నాం'

ఏర్గట్ల, మార్చి 26: సొసైటీ పరిధిలోని రైతులకు సకాలంలో ఎరువులు, రుణాలను అంద జేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘ మహాజన సభను సంఘ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య అధ్యక్షతన నిర్వహించగా కార్యదర్శి శ్రీనివాస్ ఆదాయ వ్యయాలు చదివి వినిపించారు. రైతులు తమ రుణాలు కట్టి కొత్త రుణాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సింగసారం గంగారాం, బద్ధం ప్రభాకర్, కొలిప్యాక శ్రీనివాస్, బద్ధం హన్మండ్లు, రేండ్ల రాజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంసీ కళాశాల వద్ద లిక్కర్ పట్టివేత

డిచ్‌పల్లి, మార్చి 26: డిచ్‌పల్లి సీఎంసీ కళాశాల, దేవపల్లి రోడ్డు అమలులో ఉన్నందున ఎలాంటి అనుమతి లేకుండా కొత్తపల్లిసందీప్ 54.6లీటర్లలిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.పట్టుకున్న లిక్కర్‌విలువ 13,650రూ.ఉంటోందని సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

రెంజల్,మార్చి26: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన రాము గత కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగలించబడిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని మంగళవారం బాధితుడు రాముకు ఎస్ఐ సాయన్న అందజేశారు. ఎవరైనా తమ మొబైల్ ఫోన్‌లు మిస్ అయితే సీఈఐఆర్ పోర్టల్‌లో తమ యొక్క వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్ఐ సాయన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గణేష్ ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

• డీఎస్పీ నాగేశ్వర్


దోమకొండలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దోమకొండ, మార్చి 26:పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించేందుకు డీఎస్పీ నాగేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బలగాలతో పోలీసులు ప్రధాన వీధుల గుండా పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించే వారికి తగిన చర్యలు తప్పవని సందేశం ఇచ్చేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎవరు కూడా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించువాలన్నారు. కార్యక్రమంలో భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, ఎస్సై గణేష్, బీబీపేట ఎస్సై ప్రభాకర్,ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్‌లను ఏర్పాటు చేయాలి


ప్రమాద సూచికలను పరిశీలిస్తున్న సీఐ సంపత్

దోమకొండ, మార్చి 26: దోమకొండ మండల పరిధిలోని అంచనూర్, సంగమేశ్వర్, అంబార్‌పేట గ్రామాల పరిధిలో ప్రమాదాలు జరిగేచోటును సీఐ సంపత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రమాదకర, మూలమాలుపుల స్థలాల్లో వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రమాదకర, మూలమాలుపుల స్థలాలో రేడియం స్టిక్కర్‌లను ఏర్పాటు చేయాలని ఎస్సైకి సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో దోమకొండ ఎస్సై గణేష్, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, నల్లపు శ్రీనివాస్, రాంరెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీపీఎడ్ 1,3వ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, మార్చి 26: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్షకు 81మంది విద్యార్థులకు గాను 78 మంది హాజరయ్యారని, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం 1వ సెమిస్టర్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన

డిచ్‌పల్లి, మార్చి 26: తెలంగాణ యూనివర్సిటీలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల తేదీలు సీవోఈ ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించేందుకు ఏప్రిల్ 1 వరకు గడువు ఉండగా అపరాధ రుసుముతో ఏప్రిల్ 4వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.600, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత కళా శాలలో సంప్రదించాలని, మరిన్ని వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్ సంప్రదిం చాలని సూచించారు.

గుర్తుతెలియని శవం లభ్యం

మాక్లూర్, మార్చి26: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మోరా చెరువులో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైయిందని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. మృతునికి 40ఏళ్లు ఉండవచ్చని చెరువులో చనిపోయి మృతదేహం పైకి తేలిందని అన్నారు. మృతుడు ఎరుపు, నలుపు గీతలతో కూడిన షర్టు, బ్లూ కలర్ నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ కోసం మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని అన్నారు.

యూత్ వెల్ఫేర్, డైరెక్టర్ కల్చరల్ యాక్టీవీటీస్‌గా లావణ్య నియామకం

డిచ్‌పల్లి, మార్చి 26: తెలుగు అధ్యాయన శాఖ ప్రొఫెసర్ కరిమిల్ల లావణ్యకు డైరెక్టర్ కల్చరల్ యాక్టివిటిస్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియామిస్తూ నియామక ఉత్తర్వులు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి ఉత్తర్వులు అందజేశారు. గతంలో లావణ్య బాలికల వసతి గృహం వార్డెన్, పరీక్షల విభాగం అదనపు క ంట్రోలర్ గా, ఉమెన్ సెల్ డైరెక్టర్, పబ్లికేషన్ సెల్ డైరెక్టర్,దక్షిణ ప్రాంగణ ప్రిన్సి పా ల్, తెలుగు అధ్యా యన శాఖ అధ్య క్షుడు, పాఠ్య ప్రణా ళిక సంఘం అధ్య క్షుడిగా సమర్థవం తంగా పనులు నిర్వర్తించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం

ఆర్మూర్‌రూరల్, మార్చి26: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన లావణ్య శ్రీనివాసును మంగళవారం ఆర్మూర్ మండల ప్రైవేటు పాఠ శాలల అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్యప్రవీన్ పవార్‌లు సన్మానించారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంతి గంగారెడ్డి, మానస గణేష్, గోపికృష్ణ, నలంద ప్రసాద్, వంశీప్రజ్ఞ, ఆలూర్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదాగా సాగిన మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్

బోధన్ రూరల్, మార్చి 26 : బోధన్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్‌లు లేకపోవడంతో సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీటీసీ సభ్యులు కొన్ని గ్రామాలలో బోర్లలో నీళ్ళు తగ్గడంతో తాగునీటి సమస్య ఏర్పడుతుందని వాపోయారు.ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం నీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇండ్ల నిర్మాణం, ప్రభుత్వ పనులకు ఇసుక అవసరం ఉన్నా అధికారులకు అడిగిన ఇవ్వడం లేదని, ఎన్నికల కోడ్ ఉందని అధికారులు తెలుపుతున్నారని ఎంపీపీ అన్నారు. బహిరంగ మార్కెట్‌లో టన్నుకు రూ.1200 రేటు పలుకుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. పీహెచ్‌సీలలో చిన్న పిల్లలకు సంబంధించిన కొన్ని టీకాలు ఉండటం లేవని, జిల్లా వైద్య అధికారులు అన్ని సబ్ సెంటర్‌లలో మందులు ఉండే విధంగా చర్యలుతీసుకో వాలని ఎంపీపీ సమావేశంలో కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎంపీడీవో జగదీష్ జాదవ్, బోధన్ తహసీల్దార్ గంగాధర్, ఎంపీవో మధుకర్,ఎంపీటీసీ సభ్యులు, సహకార సంఘం చైర్మ న్‌లు, గ్రామపంచాయితీ ఇన్‌చార్జీఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి రావాల్సిన వేతనాలు చెల్లించాలి

బోధ న్ రూరల్, మార్చి 26: బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు వైద్య సిబ్బందికి మూడు నెలల నుంచి వేతనాలు రావడం లేదని, ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుధాకర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్య సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు గత మూడు నెలల నుంచి వేతనాలు రావడం లేదని సంబంధిత కాంట్రాక్టర్‌కు 6వ తేదిన సమ్మె నోటీసు ద్వారా తెలియజేసినా స్పందించడం లేదని, వేతనాలు ఇవ్వకపోవడంతో సమ్మె నిర్వహించి నిరసన తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైద్య సిబ్బందికి రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, నాగమణి, సతీష్, జాఫర్, మాధవి, సాయిలు, దత్తు, కార్మికులు తదితరులు ఉన్నారు.


బోధన్ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మోర్తాడ్‌లో ఎరువుల డీలర్‌లు ఈ-పాస్ మిషన్ ద్వారా అమ్మకాలు జరపాలి

• జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్


మోర్తాడ్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారివాజీద్‌హుస్సేన్

మోర్తాడ్, మార్చి26: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ తనిఖీ చేశారు. మండలంలోని ఎరువుల దుకాణాలను, ఎరువుల నిల్వలను ఈపాస్ మిషన్, బౌతిక నిల్వలతో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్‌లు మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని సూచించారు. ఎవరైన ఈ-పాస్ ద్వారా కాకుండా అమ్మకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఏవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, మండల వ్యవసాయాధికారి లావణ్య, ఎరువుల డీలర్‌లు పాల్గొన్నారు.

ముస్లిం నిరుపేదలకు నిత్యావసర సరకుల పంపిణీ


కమలపూర్ నర్సరీలో నిత్యావసర సరకులను అందజేసిన అటవీశాఖాధికారి

డిచ్‌పల్లి, మార్చి 26: ఇందల్వాయి అటవీ శాఖ అధికారి సుబ్బరావు తన సిబ్బందితో కలిసి మంగళవారం కమలాపూర్ ఫారెస్ట్ సెంట్రల్ నర్సరిలో పని చేసే 13మంది నిరు పేద మైనార్టీ కుటుంబాటకు రంజాన్ సందర్భంగా నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరావు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు తన వంతు సహకారం ప్రతి యేటా అందజేస్తానని, గతంలో తన తల్లి మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ ని తాను కొనసాగిస్తున్నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారిని సాయిదీప్తి, సిబ్బంది హరిశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ విద్యార్థులకు నెట్ ఫెలోషిప్ ఇవ్వాలి

డిచ్‌పల్లి, మార్చి 26: ఓబీసీ పరిశోధన విద్యార్థులకు, అధ్యాపకులకు, ఓబీసీ నెట్ ఫెలోషిప్ సంఖ్యను 1000 నుంచి 5 వేలకు పెంపు చేయాలని ఐసీఎస్ఎస్ఆర్ రిసార్చ్ నిధుల ద్వార జరిగే ప్రాజెక్టుల్లో ఫెలోషిప్‌లో ఓబీసీ కోటను అమలు పర్చకపోవడంతో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు వినతి పత్రం అందజేసినట్లు లక్ష్మీనారా యణ తెలిపారు. ఇందుకు బండి సంజ య్ సానుకులంగా వ్యక్తం చేసినట్లు పే ర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో రా మ్, గణేశ్,పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీటితో పాఠకులకు అవస్థలు

ఆర్మూర్‌టౌన్, మార్చి26: పట్టణంలోని జంబి హన్మాన్ ఆలయ ఆవరణలో లైబ్రరీలో డ్రైనేజీ వ్యవస్థతో పాఠకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. లైబ్రరీలో ఉన్న టాయిలెట్ రూం నీరు బయటకు వెళ్ళకుండా పైప్‌లైన్ చెడిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. దీంతో పాఠకులు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ వ్యవస్థను బాగుపరిచి పాఠకులకు ఏలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రియో డ్రైవ్ ఇన్ పరిశీలన

డిచ్‌పల్లి, మార్చి 26: బర్దిపూర్ శివారులో గల రియో డ్రైవ్ ఇన్ లో హోళీ పర్వదినం సందర్భంగా పోలీసులు తనిఖీలు చేయగా ఎలాంటి మద్యం లభించలేదని ఎస్సై మహేశ్ తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు కొనసాగించాలని ఎస్సై సూచించారు.

తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఏర్గట్ల, మార్చి 26: మండల పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు తాగు నీటి సమస్యలు ఎదుర్కోకుండా నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని డీ ఎల్‌పీవో శివకృష్ణ ప్రత్యేకాధికారులకు, కార్యదర్శులకు సూచించారు. మంగళ వారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో డీఎల్‌పివో శివకృష్ణ మాట్లాడుతూ మండలంలోని అన్ని జీపిలు వంద శాతం ఇంటి పన్నుల వసూలు చేయాలని, నీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. అనంతరం ఇంటి పన్నులపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొనగా రూ.78వేల600 వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివ చరణ్, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

అర్గుల్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, మార్చి26: మండలంలోని అర్గుల్ గ్రామంలో మంగళవారం ప శువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. గ్రామంలో సుమారు 996 పశు వులు, ఆవులకు కలిపి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీచైర్మన్ రాజా రెడ్డి, పశువైద్య సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ఎల్లారెడ్డిలో 5కే రన్

ఎల్లారెడ్డి, మార్చి 26 : బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉదయం 7 గంటలకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓట్ ఫర్ ష్యూర్ అనే అంశంతో ఐదు కిలో మీటర్ల రన్ ఉంటుందని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా పోలీస్‌స్టేషన్ నుంచి ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల వరకు 5కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు వారి సిబ్బందితో సహా ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కమిటీ ఎన్నిక

సదాశివనగర్, మార్చి 26: సదాశివనగర్ మండల బీజేపీ ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కుంటరాంరెడ్డి మంగళవారం తెలిపారు. ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా కటికె రమేష్, ప్రధాన కార్యదర్శిగా అంజనేయులు, ఉపాధ్యక్షులుగా రమేష్, సంగం, రాజేష్, జాదవ్ శ్రీనివారావు, ప్రవీణ్, కార్యదర్శులు శేఖర్, రమేష్, నందురావు, బాలకిషన్, కోశాధికారిగా ఎల్లన్నలు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల నాయకులు అమృత భూంరావు, రమేష్‌రెడ్డి, చక్రధర్‌గౌడ్, ప్రవీణ్, స్వరణ్‌రెడ్డి, రాజు, మోహన్‌రాజ్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు బిగింపు

బీబీపేట, మార్చి 26: బీబీపేట మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని 1, 4వ వార్డులలో నీటి కొరత ఏర్పడడంతో అదే గ్రామానికి చెందిన సిరిగాధ స్వామి తన సొంత నిధులతో రెండు సింగిల్‌ఫేజ్ మోటార్లను బిగించారు. నీటి కొరతను తీర్చిన స్వామికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కామారెడ్డి టౌన్, మార్చి 26: నాగిరెడ్డిపేట మండలంలో గల జప్తి జాన్కంపల్లి అప్పర్ ప్రైమరి స్కూల్‌లో పని చేస్తున్న జి.ప్రవీణ్‌ను సస్పెన్షన్ చేసినట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలోని విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వల్ల చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.


లింగంపేటలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ కార్యవర్గం

లింగంపేట కాంగ్రెస్ కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, మార్చి 26: లింగంపేట టౌన్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. టౌన్ అధ్యక్షుడిగా ప్రసాద్‌గౌడ్, వైస్ ప్రసిడెంట్‌గా నవీన్, జనరల్ సెక్రెటరీగా కిరణ్, జాయింట్ సెక్రెటరీగా శ్రవణ్‌కుమార్, సాయిలు, కోశాధికారిగా భాస్కర్‌గౌడ్, యూత్ ప్రసిడెంట్‌గా ఖయ్యూమ్, కార్యదర్శిగా ప్రదీప్, జాయింట్ సెక్రెటరీగా విష్ణు, సాయిలులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడ రవి, భైరయ్య, రాజు, ఈశ్వరగౌడ్, ఖుద్దూస్, మునీర్, రఫీ, పాషాలతో పాటు నాయకులు ఉన్నారు.

ఏఎస్సార్ నూతన కార్యవర్గం

పెద్ద కొడప్‌గల్, మార్చి 26: జుక్కల్ మండల అయ్యాల సంతోష్ కుమార్ ఫౌండేషన్ (ఏఎస్సార్) నూతన కార్యవర్గంను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ తెలిపారు. అధ్యక్షుడిగా వాస్రే సతీష్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా మనోజ్, ఉపాధ్యక్షులుగా గజానంద్ గౌడ్, అంజయ్య, సహాయ కార్యదర్శిగా మహేష్, సాయికుమార్, సోషల్ మీడియా కార్యదర్శిగా సాయినాథ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

భిక్కనూరులో ఎంపీడీవోను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

భిక్కనూరు, మార్చి 16: కమ్మర్‌పల్లి మండలంలో జరిగిన ఏసీబీ దాడుల్లో సీనియర్ అసిస్టెంట్ హరిబాబుతో పాటుగా గతంలో కమ్మరిపల్లి ఎంపీడీవోగా పని చేసిన ప్రస్తుత భిక్కనూరు ఎంపీడీవో సంతోష్ రెడ్డిని ఏసీబీ అధికారులు మంగళవారం భిక్కనూరులో అదుపులోకి తీసుకుని కమ్మర్‌పల్లికి తరలించారు. సర్వీస్‌బుక్‌లో వివరాల నమోదు విషయంలో ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్‌లు డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు సమాచారం. భిక్కనూరు ఎంపీడీవో ఏసీబీకి చిక్కడంతో మండలంలోని ఆయాశాఖల అధికారులు ఉలిక్కిపడ్డారు.

మండలాధ్యక్షుడికి సన్మానం

మద్నూర్, మార్చి 26: ఇటీవల జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు నియమించారు. కాంగ్రెస్ పార్టీ మద్నూర్ అధ్యక్షుడిగా సాయిలును ఎంపిక చేయగా, కాంగ్రెస్ నాయకులు, మేనూర్ గ్రామ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సంగమేశ్వర్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.


హత్యకు గురైన బోయ నవీన్ (ఇన్‌సెట్‌లో ఫైల్)


రోదిస్తున్న కుటుంబీకులు

కామారెడ్డిలో యువకుడి దారుణ హత్య

- రామేశ్వర్‌పల్లి శివారుల్లో ఘటన
- ఛాతి భాగంలో తీవ్రంగా పొడిచిన వ్యక్తులు
- మృతుడు పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన నవీన్‌గా గుర్తింపు
- ఇంటి పరిసరాల్లోని ఓ కుటుంబంతో గొడవ
- పాత కక్షలతో వారే చంపి ఉంటారని కుటుంబీకుల వెల్లడి

కామారెడ్డి టౌన్, మార్చి 26: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి శివారుల్లో మంగళవారం ఓ యువకుడి దారుణహత్య తీవ్ర కలకలం రేపింది. మృతుడి కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన బోయ నవీన్(23) అనే యువకుడు వృత్తిరీత్యా ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం తన తల్లిని పొలం వద్ద దింపి ఆరేపల్లి నుంచి రామేశ్వర్‌పల్లి మీదుగా కామారెడ్డికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఆరేపల్లి గ్రామానికి చెందిన భువనగిరి మధు, పొందుర్తి ప్రవీణ్ అనే వ్యక్తులు బైక్‌పై ఆటోను వెంబడించి వచ్చి నవీన్‌ను పాతకక్షలతో రామేశ్వర్‌పల్లి శివారులో అడ్డగించి వాగ్వాదానికి దిగారు. అతనిని రోడ్డుకు కొద్ది దూరంలోని ఓ పొదల వద్దకు తీసుకెళ్లి కూరగాయలు కోసే కత్తితో ఛాతిపైన, కడుపులో, మెడపైన, ఎడమ చేతిపైన దారుణంగా పొడిచి చంపారని కుటుంబీకులు, గ్రామస్థులు వెల్లడించారు. రక్తపు మడుగులో పడిఉన్న నవీన్‌ను చూసిన పలువురు పోలీసులకు సమాచారం అందించడంతో రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్‌ఐ రాజులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి బోయ పెద్ద నర్సయ్య మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఇంటి పరిసరాలల్లోని మధు కుటుంబంతో తమకు గొడవలు జరుగుతున్నాయని పలుమార్లు నవీన్‌ను బెదిరింపులకు గురి చేశారని తెలిపాడు. పాత కక్షలు మనస్సులో పెట్టుకుని వారే తన కొడుకు నవీన్‌ను చంపారని తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అక్కలు ఉన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 26: వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తాగునీటి ఎద్దడిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రతీ గ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో తాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని కోరారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి సరఫరాను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏమైన ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసానికి ముందే అధికార పార్టీలో చేరిన ఎంపీపీ

మద్నూర్, మార్చి 26: మద్నూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు లక్ష్మీబాయి ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఉన్నటువంటి ఎంపీపీ లక్ష్మీబాయికి ఏప్రిల్ 1న అవిశ్వాసం అధికార పార్టీ వారు పెట్టడంతో ఆమె బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోయారు. గతంలో అవిశ్వాసం పెట్టగా కోర్టు నుంచి స్టే తీసుకుని వచ్చారు. స్టేను వేకెంట్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం పెట్టడంతో ఎంపీపీగా ఉన్న లక్ష్మీబాయి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఉమ్మడి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీపీగా కొనసాగుతారు. ఇప్పటికే మెజార్టీ ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరడంతో అవిశ్వాసం నెగ్గలేక పోతామని కాంగ్రెస్‌లో చేరినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మద్నూర్ మండలంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. రోజు రోజుకూ ఉమ్మడి మద్నూర్ మండలంలో కాంగ్రెస్ మెజార్టీ పెరుగుతున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సంగమేశ్వర్, సాయిలు, డోంగ్లీ పార్టీ అధ్యక్షుడు రాజు పటేల్, ఎంపీటీసీలు దీన్ దయాల్, వట్నాల్ రమేష్, జావీద్, హన్మాండ్లు స్వామి, వైస్ ఎంపీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీపీ లక్ష్మీబాయి

ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేత

బాన్సువాడ టౌన్, మార్చి 26: బకాయి వేతనాలు చెల్లించాలని ఆస్పత్రి కార్మికులు మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు మాట్లాడుతూ ఏరియాస్పత్రి, ఎంసీహెచ్ ఆస్పత్రులలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డ్స్ తదితర కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల వేతనాలు రావాల్సి ఉందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని, దీంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ , ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసును అందజేశామన్నారు. తక్షణమే కాంట్రాక్టర్ స్పందించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో దశల వారిగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ కమ్రొద్దీన్, రేణుక, సంతోష్‌గౌడ్, సురేఖ, గంగారాం, తదితరులున్నారు.


సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ గల్లంతు చేయాలి

- బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే

ఎల్లారెడ్డి, మార్చి 26: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే విమర్శించారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలు అయినా ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇప్పటి వరకు ఇవ్వలేదని, మహిళలకు రూ.2,500, విద్యార్థులకు ఐదు లక్షల విద్య భరోసా కార్డు, అర్హులందరికీ నాలుగు వేలు పెన్షన్, రైతులకు పంట సాయంగా రైతు భరోసా వంటి పథకాలు ఇంకా ఇవ్వడం లేదని ప్రజలు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని గమనించి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ గల్లంతయ్యే విధంగా ప్రజలు సంచలనం అయిన తీర్పును ఇవ్వాలని కోరారు.

మహ్మద్‌నగర్‌లో అంబలి కేంద్రం ప్రారంభం

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మార్చి 26: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో స్వర్గీయ దఫేదార్ కిషన్ జ్ఞాపకార్థం కుమారుడు మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు మంగళవారం అంబలి కేంద్రం, చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ యేడు లాగే ఈ సారి కూడా అంబలి కేంద్రం, చలి వేంద్రాన్ని ప్రారంభించామన్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, సత్యనారాయణ, మహేందర్, రామాగౌడ్, బాగారెడ్డి, సాయిరెడ్డి, బాగా రెడ్డి, నాయకులు, తదితరులున్నారు.



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఓటుహక్కు వజ్రాయుధం

తాడ్వాయి, మార్చి 26: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అనేది వజ్రాయుధం లాంటిదని ఐఎస్ఆర్డీ స్వచ్ఛంధ సంస్థ కార్యదర్శి అమృతరాజేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో సామాన్యుడి వజ్రాయుధం ఓటు అని తెలిపారు. మనల్ని ఎవరు పరిపాలించాలో నిర్ణయించుకునే అధికారం ప్రతీ పౌరుడికి ఉంటు ందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఉత్తమమైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. ఏపీఎం రవీందర్ మాట్లాడుతూ సంఘాల బలోపేతం, కొత్త జీవనోపాదుల కల్పన, లక్పతిదీదీ, ఆర్థిక చేయూత, బ్యాంకు రుణాలు, ఇన్సూరెన్స్, ఉపాధి కల్పనలు, ప్రభుత్వ పథకాలు, అమ్మ ఆదర్శ కమిటీ, వడ్డీ రాయితీ, మహిళా సంఘాల సభ్యులకు ఇన్సూరెన్స్ లాంటి అంశాలపై సమగ్రంగా చర్చించడం జరిగిందన్నారు. డిసెంబరు 22 నుంచి మార్చి 2024 వరకు నాలుగు నెలల వడ్డీ రాయితీ మొత్తం 510 సంఘాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సమాఖ్య అధ్యక్షురాలు యశోద, సీసీలు సంగమేశ్వర్, రమేష్‌గౌడ్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమృత రాజేందర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎల్లారెడ్డి, మార్చి 26 : బైక్, లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని ఎల్లారెడ్డి-బాన్సువాడ ప్రధాన రహదారిపై ఆదర్శ పాఠశాల పరిసర ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మహ్మద్‌నగర్ మండల పరిధిలోని వాసన్‌పల్లి గ్రామానికి చెందిన గూడెప్ప ప్రశాంత్(23) ఎల్లారెడ్డి నుంచి స్వగ్రామానికి హసన్‌పల్లి వెళుతున్నాడు. ఈ క్రమంలోనే ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల వద్దకు రాగానే ప్రశాంత్ బైక్‌ను నిజాంసాగర్ వైపు వెళుతున్న ఓ లారీ అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు లారీతో పాటు డ్రైవర్‌ను కూడా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎల్లారెడ్డి ఎస్‌ఐ బొజ్జ మహేష్ తెలిపారు.


ప్రశాంత్ (ఫైల్)

ట్రాక్టర్ ఆర్టీసీ బస్సు ఢీ

- తృటిలో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డి, మార్చి 26: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోయిన బాన్సువాడ డిపోకు చెందిన బస్సు ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణించే ప్రయాణికులు ఇరుక్కుపోవడంతో పోలీసులు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.


ధ్వంసమైన బస్సులు అద్దాలు

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

లింగంపేట, మార్చి 26: మండలంలోని నల్లమడుగు పెద్దతండాకు చెందిన బాదావత్ కిషన్‌కు చెందిన గుడిసె మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కాలి బూడిదయినట్లు ఆర్‌ఐ బాలయ్య తెలిపారు. ప్రమాదంలో బియ్యం, బట్టలు, వంట సామగ్రితో పాటు పూర్తిగా కాలిపోయినట్లు ఆయన తెలిపారు. ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి, మార్చి 26: యువతి అదృశ్యమైన సంఘటన ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎల్లారెడ్డి ఎస్‌ఐ బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుసుమ బేగం ఆమె భర్త పిల్లలతో కలిసి గత కొన్ని సంవత్సరాల క్రితం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో జీవనం కొనసాగిస్తున్నారు. తన కూతురు చెబితే వినడం లేదని మందలించినందుకు మస్కాన్ బేగం ఈనెల 20వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి రాత్రి వెళ్లిపోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.


పాలకవర్గం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

షెట్టర్ల నిర్మాణం చేపట్టాలి

- ఎల్లారెడ్డి సహకార సంఘ సమావేశంలో తీర్మానం

ఎల్లారెడ్డి, మార్చి 26: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం సమావేశాన్ని మంగళవారం చైర్మన్ నర్సింలు అధ్యక్షతన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శి విశ్వనాథం సంఘానికి సంబంధించిన ఆరు నెలలకు సంబంధించి ఆదాయ, వ్యయాలను సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో గండి మాసానిపేట్‌లో కార్యాలయం పక్కన షెట్టర్ల నిర్మాణం, లింగారెడ్డిపేట్ కార్యాలయం పక్కన ప్రహరీ నిర్మాణం, ఆజాద్ గ్రౌండ్‌కు ప్రహరీ, రేకుల షెడ్డు నిర్మించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మత్తమాల ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు మగ్గి ప్రకాష్, సుకిందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'టెట్' ఫీజులను తగ్గించాలి

- దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, మార్చి 26: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టెట్ పరీక్షకు ఫీజులను తగ్గించాలని ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉండి పరీక్ష ఫీజు లేకుండానే పరీక్షలు నిర్వహించాలని నిజామాబాద్ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టు కావడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్, టీడీపీ నాయకులు బొబ్బ నర్సింహారావు, కోయేడి నర్సింలు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	- రజాకార్
శాంతి	- ప్రేమలు
ప్రియా 70	- భీమా
ప్రియా 35	- ఓ భీం బూష్

బాన్సువాడ	
మహేశ్వరి	- ఓం భీం బుష్
వెంకటేశ్వర	- రజాకార్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

